మందకొడిగా వరి నాట్లు

- సబ్ డివిజన్‌లో 34.5 శాతం నాట్లు పూర్తి
- త్వరగా వేసుకోవాలని సూచిస్తున్న వ్యవసాయాధికారులు



జంగారెడ్డిగూడెం మండలంలో వరి నాట్లు వేసిన దృశ్యం

జంగారెడ్డిగూడెం: వ్యవసాయశాఖ సబ్‌డివిజన్ పరిధిలో 34.5శాతం వరినాట్లు పూర్తయ్యాయి. ఈ ఏడాది వరినాట్లు ఆలస్యంగా, మందకొడిగా సాగుతున్నాయి. వరినాట్లు త్వరగా పూర్తిగా చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. కేఆర్‌పురం వ్యవసాయ శాఖ సబ్‌డివిజన్ పరిధిలో జంగారెడ్డిగూడెం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, కొయ్యలగూడెం, కుక్కునూరు, పోలవరం, వేలేరుపాడు మండలాలు ఉన్నాయి. అయితే ప్రధానంగా సబ్‌డివిజన్ పరిధిలో రబీ సాగుకు సంబంధించి వరి 10630 ఎకరాలు సాధారణ విస్తీర్ణం కాగా, ఇప్పటి వరకు 3,660 ఎకరాల్లో మాత్రమే వరి నాట్లు పడ్డాయి. జంగారెడ్డిగూడెం మండలానికి సంబంధించి 6855 ఎకరాలు సాధారణ విస్తీర్ణం కాగా, 1810 ఎకరాల్లో కొయ్యలగూడెం మండలం 909 ఎకరాలకు గాను 170 ఎకరాల్లో, పోలవరం మండలంలో 2679 ఎకరాలకు గాను, 1680 ఎకరాల్లో వరినాట్లు పడ్డాయి. ఇక బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు నాలుగు మండలాలు కలిపి 188 ఎకరాలు సాధారణ విస్తీర్ణం కాగా, ఇప్పటి వరకు ఈ నాలుగు మండలాల్లో వరి నాట్లు పడలేదు. ఇక సబ్‌డివిజన్ పరిధిలో మొక్కజొన్న 25516 ఎకరాలకు 10670 ఎకరాల్లో రైతులు పంటను వేశారు. అలాగే పెసలు 180 ఎకరాలకు గాను 8 ఎకరాల్లో, మినుము 497 ఎకరాలకుగాను 54 ఎకరాలు పంటను వేశారు. ఇక చెరుకు 1903 ఎకరాలకు గాను 109 ఎకరాల్లో పంటను వేశారు. రానున్న సీజన్‌కు తాడువాయి చక్కెర కర్మాగారాన్ని తాత్కాలికంగా మూసివేయడంతో రైతులు చెరుకు పంట వేయడం లేదు. అయితే ఇప్పటి వరకు వేసిన 109 ఎకరాల చెరుకు పంటను బెల్లం వండేందుకు రైతులు వినియోగించనున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ఇక వేరుశెనగ సాధారణ విస్తీర్ణం 1673 ఎకరాలు కాగా, 1026 ఎకరాల్లో రైతులు సాగు చేపట్టారు. వర్జీనియా పొగాకు సాధారణ విస్తీర్ణం 19649 ఎకరాలు కాగా, ఇప్పటి వరకు 16882 ఎకరాల్లో పంటను వేశారు. మొత్తంగా సబ్ డివిజన్ పరిధిలో రబీ సాగులో ఆయా పంటలకు సంబంధించి సాధారణ విస్తీర్ణం 60117 ఎకరాలు కాగా, 32409 ఎకరాల్లో ఇప్పటి వరకు రైతులు సాగు చేపట్టారు. అయితే వ్యవసాయ అధికారులు ప్రతి సీజన్‌లో త్వరగా సేద్యం పనులు చేపట్టి పూర్తి చేయాలని సూచిస్తున్నారు.

వరి నాట్లు త్వరగా పూర్తి చేసుకోవాలి



అలాగే రబీకి సంబంధించి మిగిలిన పంటలను వెంటనే వేయాలి. ఆలస్యమైతే దిగుబడి తగ్గుతుంది. వరి నాట్లు వేసిన మూడు రోజుల తరువాత కలుపు నివారణ మందు చల్లాలి. వరి నాట్లు వేసే సమయంలో భాస్వరం, పొటాషియం ఎరువులు వాడాలి. నాట్లు పైపైనే నాటుకోవాలి. చదరపు మీటరుకు 30 కుదుళ్ల నాటుకోవాలి. ప్రతి రెండు మీటర్ల దూరానికి 10 అంగుళాల బాట తీసుకోవాలి.

–పీజీ బుజ్జిబాబు, సహాయ సంచాలకులు, వ్యవసాయ శాఖ

ఆడపిల్ల టెన్షన్ కాదు.. టెన్ సన్స్‌తో సమానం

జాతీయ బాలికా దినోత్సవంలో వక్తలు



ద్వారకాతిరుమల: మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థినులు



కామవరపుకోట: విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: ఆడపిల్ల టెన్షన్ కాదని, టెన్ సన్స్‌తో సమానమని పంగిడిగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.సురేష్ అన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, మహిళా సంరక్షణ కార్యదర్శులు బాలికల ఎదుగుదల, వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టికాహారం గూర్చి అవగాహన కల్పించారు. ఆ తరువాత బాలికల ఎదుగుదల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బేటీ బచావో – బేటి పడావో అనే నినాదంతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పి.మేరీ, లక్ష్మీ రాజ్యం, మణి, మహిళా కార్యదర్శులు ఎండీ నసీమ, టి.కమల, లక్ష్మి పాల్గొన్నారు.

కామవరపుకోటలో..

కామవరపుకోట: మండలంలోని రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ బాలిక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు ఉమ్మడి భీమరాజు మాట్లాడుతూ బేటీ బచావో బేటీ పఢావో నినాదం గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు మంగాదేవి, వీర కుమారి, ఉమెన్ పోలీస్ ఎస్.పుష్పవతి, అంగన్‌వాడీ కార్యకర్తలు సరోజిని, సుజాత, రాణి పాల్గొన్నారు.

ప్రత్యేక అధికారి పాఠశాలల తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌డీవో రాజు

కొయ్యలగూడెం: మండల ప్రత్యేక అధికారి, డీఎల్‌డీవో ఎం.రాజు శుక్రవారం మండలంలో పాఠశాలలను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పాఠశాలల పునర్ వ్యవస్థీకరణ కార్యక్రమంలో భాగంగా పాఠశాలల రికార్డు పరిశీలనకు మండలంలోని పలు పాఠశాలలో అమలవుతున్న విధానాలను పరిశీలించడానికి విచ్చేసినట్లు ఆయన తెలిపారు. పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. పరిశీలించిన వివరాలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళతానన్నారు.

పోలవరం రూరల్: మండలంలోని పలు పాఠశాలలను మండల ప్రత్యేక అధికారి, డిప్యూటీ డైరెక్టర్, వయోజన విద్య జీసీహెచ్ ప్రభాకర్ శుక్రవారం తనిఖీ చేసినట్లు ఎంఈవో జె.సురేష్‌బాబు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పాఠశాలల పునర్ వ్యవస్థీకరణలో భాగంగా పోలవరం మండలంలోని పాఠశాలల రికార్డు పరిశీలించినట్లు తెలిపారు.

ధర్మకర్తలుగా సేవలందించడం ఎంతో భాగ్యం



పాలకవర్గ సభ్యులకు వీడ్కోలు పలుకుతున్న ఆలయ ఈఓ త్రినాథరావు

ద్వారకాతిరుమల: దైవ సన్నిధిలో ధర్మకర్తలుగా పని చేస్తూ.. భక్తులకు సేవలు అందించే భాగ్యం కలగడం పూర్వజన్మ సుకృతమని దేవస్థానం చైర్మన్ ఎస్వీ సుధాకరరావు అన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నియమించిన ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం పాలక మండలి గడువు వచ్చే నెల 9తో ముగియనుంది. దీన్ని పురస్కరించుకుని కొండపైన ఆలయ చైర్మన్ చాంబర్‌లో శుక్రవారం ఆఖరి పాలకవర్గ సమావేశంతో పాటు, పాలకవర్గ సభ్యుల వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు, ఇన్‌చార్జి ఈఓ వేంద్ర త్రినాథరావు, అనువంశిక ధర్మకర్త ఎస్వీ నివృతరావు పాలకవర్గ సభ్యులకు శ్రీ వారి శేష వస్త్రాలను కప్పి, స్వామి వారి మెమెంటోలు అందించి ఘనంగా సత్కరించారు. పాలకవర్గ సభ్యులు నాళ్లం కృష్ణ వీర సుబ్బలక్ష్మి, చిట్టూరి మణి, పెద్దిరెడ్డి వెంకటకొండ పద్మ, మానుకొండ సుబ్బారావు, గంగరాజు, పాయం మంగతాయారు, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ తెల్లం పరివార్‌కు ఆహ్వానం



దుద్దుకూరులో మాజీ ఎమ్మెల్యే బాలరాజుకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం దేవరపల్లి గ్రామంలో ఈ నెల 30, 31వ తేదీల్లో నిర్వహించనున్న ఆదివాసీ తెల్లం పరివార్ మహోత్సవ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజును పరివార్ సంఘ నేతలు శుక్రవారం ఆహ్వానించారు. ఈ మేరకు దుద్దుకూరులో ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు మాట్లాడుతూ తెలంగాణ, ఒరిస్సా, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో నివసిస్తున్న తెల్లం ఇంటి పేరుతో ఉన్న వారు తెల్లం పరివార్ మహోత్సవాలను ఎంతో వైభవంగా నిర్వహిస్తారని చెప్పారు. కొమ్ముడ్యాన్స్, అర్జిడోలు, కుర్రెడోలు, మేళాలు, గుసాడి కళాకారులతో గిరిజన సంస్కృతి ఉట్టిపడే విధంగా ఈ మహోత్సవాలు నిర్వహిస్తారన్నారు. 40 సంవత్సరాల క్రితం తన తండ్రి తెల్లం చిన్నవడ్డీ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని చెప్పారు. మళ్లీ ఇప్పుడు తనకు కార్యక్రమంలో పాల్గొనే అవకాశం దక్కడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తుందని చెప్పారు. తనతోపాటు భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు కూడా పాల్గొంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఆహ్వాన కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

కొయ్యలగూడెం: జాతీయ ఓటర్ల దినోత్సవం జనవరి 25వ తేదీన నిర్వహణకు బూత్ లెవెల్ అధికారులు సిద్ధంగా ఉండాలని తహసీల్దార్ కె.చెల్లన్నదొర పేర్కొన్నారు. శుక్రవారం కార్యాలయంలో బూతు లెవల్ అధికారులకు నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహణకు సంబంధించిన అంశాలపై సూచనలు సలహాలు అందజేశారు. ప్రజల్లో ఓటు హక్కుపై అవగాహన కల్పించేందుకు ప్రజా ప్రతినిధులతో కలిసి ర్యాలీలు, సమావేశాలు నిర్వహించాలని, విద్యార్థులకు ఓటు హక్కు గురించి అవగాహన కల్పించాలని ఆదేశించారు.

ఓటు ప్రాముఖ్యతపై వ్యాసరచన

కామవరపుకోట: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ ఎం.మల్లేశ్వరరావు అధ్యక్షతన 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శుక్రవారం కళాశాలలో ఓటు హక్కు వినియోగం, ప్రాముఖ్యత అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపల్ మల్లేశ్వరరావు మాట్లాడుతూ విద్యతో పాటు అన్ని రంగాల్లోనూ విద్యార్థులు రాణించాలని సూచించారు.

అడవులను ప్లాస్టిక్ రహితం చేస్తాం



ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించిన అధికారులు

బుట్టాయగూడెం: అడవులను ప్లాస్టిక్ రహితంగా మార్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కన్నాపురం రేంజ్ అధికారి ఎ.శివరామకృష్ణ తెలిపారు. స్వచ్ఛ ఏపీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని మారుమూల గ్రామమైన ముంజులూరు సమీపంలో ఏనుగుతోగు వాటర్ ఫాల్స్ వద్ద అటవీశాఖ అధికారులు శుక్రవారం స్వచ్ఛ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతంలో పర్యాటకులు వదిలేసిన ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు, విస్తర్లు, తదితర చెత్తను తొలగించి ఆ ప్రాంతాన్ని పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణాల్లోనే కాకుండా అటవీ ప్రాంతంలో కూడా ప్లాస్టిక్ రహిత ప్రాంతంగా తీర్చిదిద్దేలా కృషి చేస్తున్నామని చెప్పారు. దీనిలో భాగంగా ముంజులూరు గ్రామస్తులతో కమిటీని ఏర్పాటు చేసి వారి ద్వారా జలపాతానికి వెళ్లే పర్యాటకులు వాటర్ బాటిల్ తీసుకెళితే రూ.20 కట్టించుకునే విధంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. మళ్లీ ఆ వ్యక్తి తీసుకెళ్లిన బాటిల్‌ను తెస్తే ఆ సొమ్మును తిరిగి ఇస్తామని చెప్పారు. అలా కాకుండా ఎక్కడపడితే అక్కడ ప్లాస్టిక్ వస్తువులు వదిలి వేస్తే కమిటీ ద్వారా వచ్చిన సొమ్ములతో ఆ ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేస్తామన్నారు. దీనికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ జె.ప్రభాకర్, ఎఫ్ఎస్ఓలు కరీమ్, పోసీరావు, దినేష్, బీట్ అధికారులు, ప్రొటెక్షన్ హెల్పర్లు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సమ్మె



జంగారెడ్డిగూడెం: సమ్మె చేస్తున్న ఏపీ మెడికల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ యూనియన్ నేతలు



చింతలపూడి: ఏరియా ఆసుపత్రి వద్ద సమ్మె చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

చింతలపూడి: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు శుక్రవారం నుంచి సమ్మెలోకి వెళ్లినట్లు ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి తోర్లపాటి బాబు తెలిపారు. పారిశుద్ధ్య కార్మికుల విభాగం అధ్యక్షురాలు టి.మరియమ్మ, కె.శ్రీనివాసరాజు, పి.వాణి, కె.నాగరాజు, జి.దేవమణి, ఎం.సుజాత, పి.రాజకుమారి, బి.వెంకటరావు, టి.రాము, తదితరులు పాల్గొన్నారు.

నిరవధిక సమ్మె

జంగారెడ్డిగూడెం: ఏరియా హాస్పిటల్ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని శుక్రవారం కార్మికులు నిరవధిక సమ్మె ప్రారంభించారు.కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల కార్యదర్శి కుంచె వసంతరావు, మేరీ, దయామణి, చంద్రకళ, ప్రభావతి, జె.దుర్గారావు, పి.శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం



కొయ్యలగూడెం మండల పరిషత్ కార్యాలయం

కొయ్యలగూడెం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.కిరణ్‌కుమార్ తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటలకు సర్వసభ్య సమావేశం ఎంపీపీ గంజిమాల రామారావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. సమావేశానికి హాజరు కావాల్సిన అధికారులు మధ్యాహ్నం రెండు గంటలకు హాజరు కావాల్సిందిగా ఆయన ఆదేశాలు జారీ చేశారు.

నిధుల మంజూరులో వివాదం

కొయ్యలగూడెం మండల పరిషత్ నిధుల పంపిణీ వ్యవహారం వివాదంగా మారింది. గత రెండు పర్యాయాల్లో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో మండల పరిషత్ నిధుల గురించి, వాటి కేటాయింపుల గురించి అధికారులను వివరణ అడిగినప్పటికీ ఇప్పటి వరకు ఏవిధమైన సమాచారం ఇవ్వలేదని వైస్ ఎంపీపీ తుమ్మలపల్లి గంగరాజు శుక్రవారం ఆరోపించారు. సర్వసభ్య సమావేశం నిర్వహించినప్పుడల్లా అజెండా అంశాలు లేకుండానే నిర్వహిస్తూ ఉండడంతో పాటు, నిధుల మంజూరు, ఎంపీటీసీలకు కేటాయింపులు అవకతవకలు చోటు చేసుకుంటున్నాయని ఆయన పేర్కొన్నారు. ఎంపీటీసీలతో చర్చలు నిర్వహించకుండానే ఏకపక్ష ధోరణితో నిధుల మంజూరు అవుతున్నాయన్నారు. అదేవిధంగా అవుట్‌సోర్సింగ్ పోస్టుల నియామకంలో అవకతవకలు చోటు చేసుకున్నాయన్నారు. కాగా మండల పరిషత్ కార్యాలయంలోని ఓ ఉద్యోగి తీరు పట్ల సభ్యులు ఆరోపణలు చేస్తున్నారు. ఆ ఉద్యోగి కీలకంగా వ్యవహరిస్తూ తన పరిధిని దాటి ప్రజా ప్రతినిధులను లోబరుచుకొని నిబంధనలను తుంగలో తొక్కుతున్నారని, అవకతవకలకు సహకరిస్తున్నారని ఎంపీటీసీలు ఆరోపిస్తున్నారు. సమాచార హక్కు చట్టంలో మండల పరిషత్ నిధుల మంజూరు పంపిణీల గురించి వివరాలు అడిగినప్పటికీ నెలలు గడుస్తున్నా దానికి సమాధానం ఉండడం లేదని అర్జీదారులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో శనివారం నిర్వహించే సర్వసభ్య సమావేశంలోనైనా తమ ప్రశ్నలకు సమాధానాలు ఉంటాయా లేక షరా మామూలుగానే మారుతుందా అంటూ పరిషత్ సభ్యులు చర్చించుకుంటున్నారు.

బడ్డీ కొట్టు తొలగింపు

సాక్షి స్పందన

జంగారెడ్డిగూడెం: కాదేదీ ఆక్రమణకు అనర్హం అనే శీర్షికన సాక్షిలో శుక్రవారం ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. అక్రమంగా డిగ్రీ కళాశాల గోడ పక్కనే ఏర్పాటుచేసిన బడ్డీ కొట్టును తొలగించారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల గేటును పక్కనే ప్రహరీ గోడకు ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంలో రాత్రికి రాత్రే బడ్డీ కొట్టును ఏర్పాటు చేశారు. ప్రభుత్వ స్థలం కావడంతో పాటు, ఎటువంటి అనుమతులు లేకుండా బడ్డీ కొట్టు ఏర్పాటు చేయడంతో, సాక్షిలో ప్రచురించిన శీర్షికపై మున్సిపల్ కమిషనర్ కేవీ రమణ స్పందించారు. ఆయన ఆదేశాలపై సిబ్బంది బడ్డీ కొట్టు తొలగించారు.

కోడి పందేలపై దాడి

జంగారెడ్డిగూడెం: మండలంలోని పుట్లగట్లగూడెంలో కోడి పందేలపై లక్కవరం ఎస్సై శశాంక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఇద్దరిని అరెస్టు చేసి వారి నుంచి రూ.10,400 నగదు, ఒక కోడి పుంజును స్వాధీనం చేసుకున్నట్లు ఆమె తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

క్లుప్తంగా

ముత్యాలమ్మకు పంచామృత అభిషేకాలు



ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: ముత్యాలమ్మ అమ్మవారికి శుక్రవారం సందర్భంగా పంచామృత అభిషేకాలతో పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణకర్త బవిరిశెట్టి మురళీకృష్ణ పద్మకుమారి దంపతులు ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ కె.విజయశర్మ పంచామృత ఏకవార రుద్రాభిషేకాలు, పలు రకాల హారతులతో విశేష పూజలు చేశారు. శుక్రవారం అమ్మవారిని బొమ్మగాని ధర్మ రాజు, అరుణ్‌కుమార్, చోడవరపు రంగా జ్యోతి ప్రసాద్, విజయలక్ష్మి, మారిశెట్టి మంగ, వంకాయల వాసవి, లైటింగ్ శీను, బ్రహ్మం, టిప్ టాప్ చంటి, దువ్వ రామకృష్ణ, యర్ర నాగేశ్వరావు, సత్య రామకృష్ణ, అనురాధ, తదితరులు దర్శించుకున్నారు.

వసతి గృహం తనిఖీ



విద్యార్థులతో భోజనం చేస్తున్న ప్రత్యేక అధికారి

జంగారెడ్డిగూడెం: బీసీ బాలుర వసతి గృహాన్ని ప్రత్యేక అధికారి కేఎస్ ప్రకాశరావు శుక్రవారం తనిఖీ చేశారు. హాస్టల్ విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను రోజువారీ మెనూ సక్రమంగా అమలవుతుందా లేదా అనే వివరాలు తెలుసుకున్నారు. హాస్టల్ వార్డెన్ వెంకటేశ్వరరావుకు ఆయన పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కేఎస్ ప్రకాశరావు మాట్లాడుతూ వసతి గృహంలో మెనూ సక్రమంగా అమలు చేయాలన్నారు. ప్రత్యేకాధికారి వెంట తహసీల్దార్ కె.స్లీవజోజి, ఎంఈవో బి.రాముడు ఉన్నారు.

జైవిక్ అవార్డు గ్రహీతకు అభినందనలు



గోపాలకృష్ణమూర్తికి అవార్డు అందిస్తున్న కలెక్టర్

ద్వారకాతిరుమల: మండలంలోని గుండుగొలనుకుంటకు చెందిన జైవిక్ ఇండియా అవార్డు–2025 గ్రహిత ఒబిలిశెట్టి గోపాల కృష్ణమూర్తిని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి శుక్రవారం అభినందించారు. శ్రీసుబ్రమణ్యేశ్వర ప్రకృతి వనరులు, శిక్షణా కేంద్రం ద్వారా కషాయాలు తయారు చేస్తూ, ప్రకృతి వ్యవసాయాన్ని అభివృద్ధి చేస్తున్న గోపాలకృష్ణమూర్తికి అంతర్జాతీయ యోగ్యత కేంద్రం ఈ నెల 22న బెంగుళూరులో జైవిక్ అవార్డును అందించింది. ఆయనను ప్రశంసించిన వారిలో ఏలూరు జిల్లా వ్యవసాయ శాఖ సంచాలకులు షేక్ హబీబ్ భాషా, ఏలూరు జిల్లా అడిషనల్ డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్ బి.వెంకటేష్, తదితరులు ఉన్నారు.

చోరీ కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: చోరీపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. జంగారెడ్డిగూడెం మారుతీనగర్‌కు చెందిన షేక్‌బాషా ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నారు. ఉమ్మడి కుటుంబం కావడంతో తనకు వచ్చిన వాటా వంటగదిలో సామగ్రి ఉంచుకుని, ఉమ్మడి బెడ్‌రూమ్‌లో కుటుంబంతో నిద్రపోతున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 23వ తేదీ వంట గదికి తాళం వేసి బెడ్ రూమ్‌లో నిద్రపోయాడు. 24వ తేదీ ఉదయం వంట గదికి వెళ్లగా గది తాళం పగలగొట్టి, బట్టలు చిందర వందరచేసి, వాటిలో ఉంచిన రూ. 2500 నగదు, సుమారు ఎనిమిది కాసుల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించాడు. ఈ మేరకు బాషా ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నేడు జాబ్‌మేళా

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త అధ్వర్యంలో కొయ్యలగూడెంలోని ప్రకాశం డిగ్రీ కళాశాలలో ఈనెల 25వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఏలూరు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.జితేంద్ర బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో మెడ్ ప్లస్ హెల్త్ సర్వీస్, ఏపీఏసీ ఒరిజియో ఫైనాన్షియల్ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. అభ్యర్థులు పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పీజీ విద్యార్హతలు ఉండి 18–35 సంవత్సరాల వయసు గల వారు అర్హులని తెలిపారు. వివరాలకు 9666322 032, 9182342 688ను (కమాండ్ కంట్రోల్ నంబర్లు 9988853 335, 8712655686, 8790118349, 879011 7279ను సంప్రదించొచ్చన్నారు.

పశు వైద్య శిబిరం ఏర్పాటు

కొయ్యలగూడెం: రాజవరం గ్రామంలో పశు వైద్య శిబిరాన్ని ఏడి సోమశేఖర్ దొర శుక్రవారం ప్రారంభించారు. సర్పంచ్ ఏలేటి చిన్న తుక్కయ్యతో కలిసి ఎనిమిది వందలకు పైగా పశువులకు కోళ్లకు ఔషధాలను పంపిణీ చేశారు. చొప్పరామన్న గూడెంలో శుక్రవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. 130కి పైగా పశువులకు వైద్య చికిత్సను తీసుకున్నట్లు పశువైద్య శాఖ అధికారి బిఆర్ శ్రీనివాస్ పేర్కొన్నారు.

డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం

కుక్కునూరు: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన డ్రైవర్ కుటుంబానికి తమ వంతు బాధ్యతగా ఆటో యూనియన్ సభ్యులు శుక్రవారం ఆర్థిక సాయాన్ని అందించారు. మండల కేంద్రానికి చెందిన ఆటో డ్రైవర్ గరాటం హరీష్ ఇటీవల భద్రాచలం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో మృతుడు హరీష్ భార్యకు ఫ్రెండ్స్ టాటా మ్యాజిక్ యూనియన్ ఆధ్వర్యంలో రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రెసిడెంట్ ఎడ్ల విజయరాజు, సభ్యులు బుడుగు మల్లేశ్వరావు, రహీమ్, రాంబాబు, నాగేంద్రరావు, మచర్ల పండు, బొంతు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పీసా ఎన్నికలు

బుట్టాయగూడెం: ఇటీవల వాయిదా పడిన పీసా ఎన్నికలను అధికారులు శుక్రవారం తిరిగి నిర్వహించారు. ఈ ఎన్నికలు బుట్టాయగూడెం మండలంలోని కొమ్ముగూడెం, కంగాలవారిగూడెం, చింతలగూడెం, నిమ్మలగూడెం, పులిరామన్నగూడెం, మొద్దప్పగూడెం గ్రామాల్లో నిర్వహించారు. చింతలగూడెంలో జరిగిన ఎన్నికల్లో ఉపాధ్యక్షుడిగా మొడియం అనిల్‌కుమార్, కార్యదర్శిగా మిర్తివాడ వెంకటేశ్వరరావు రెడ్డిలు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి, ఎంఈఓ తెల్లం బాబూరావు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మాల్చి వెంకన్నబాబు, కార్యదర్శి కె.వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల సామగ్రి అందజేత

కామవరపుకోట: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1984–85 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల్లో ఒకరైన విశాఖపట్టణం గీతం యూనివర్సిటీలో డైరెక్టర్ అకడమిక్ ఎఫైర్స్‌గా వ్యవహరిస్తున్న ప్రొఫెసర్ షేక్ ఖాసింబీ పాఠశాల సైన్స్ ల్యాబ్‌కు రూ.30,000 విలువ కలిగిన పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా పేరెంట్స్ కమిటీ చైర్మన్ బొబ్బిలి డాన్ దివాకర్, ఉపాధ్యాయులు ఖాసింబీకి కృతజ్ఞతలు తెలిపారు.

కలప నరికివేతపై కేసు

కొయ్యలగూడెం: నిబంధనలకు విరుద్ధంగా కలప నరికి వేయడంతో కేసు నమోదు చేసినట్లు కన్నాపురం అటవీశాఖ రేంజర్ శివరామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగపతిదేవిపేట గ్రామ సమీపంలోని ఒక రైతుకు చెందిన పట్టా భూమిలో ఉన్న టేకు చెట్లను అట వీ శాఖ అనుమతులు లేకుండా నరికి వేసినట్లు తెలిపారు. సుమారు అరవై టేకు దుంగలు గుర్తించి రైతుపై కేసు నమోదు చేశామన్నారు. వీటి విలువ సుమారు రూ.50 వేల వరకు ఉంటుందని అటవీశాఖ అధికారులు తెలిపారు.

గీత కార్మికులకు మద్యం షాపుల కేటాయింపు

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లాలో గీత కార్మి కులకు మొత్తం 14 షాపులను లాటరీ విధానంలో కేటాయించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో లాటరీ తీశారు. గౌడ సామజిక వర్గానికి నూజివీడు మున్సిపాలిటీ పరిధిలోని షాపు, చింతలపూడి రూరల్ ప్రాంతంలోని షాపులు, ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్, టి.నర్సాపురం, దెందులూరు, జంగారెడ్డిగూడెం రూరల్ పరిధిలో షాపులు, శెట్టిబలిజ సామజిక వర్గానికి జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ, చింతలపూడి, చాట్రాయి, ముసునూరు, మండవల్లి, నిడమర్రు, అగిరిపల్లి, కొయ్యలగూడెం మండలాల పరిధిలోని షాపులను కేటాయించారు. దరఖాస్తుకు గడువు ఫిబ్రవరి 5 వరకూ ఉందని, ఫిబ్రవరి 7 ఉదయం 10 గంటలకు లాటరీ పద్ధతిన దరఖాస్తుదారులను ఎంపిక చేసి షాపులను మంజూరు చేస్తామన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

కుక్కునూరు: అక్రమ మద్యాన్ని అమ్ముతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎక్సైజ్ ఎస్సై జి.వెంకటలక్ష్మి చెప్పిన వివరాల ప్రకారం మండలంలోని రాజీవ్‌నగర్ గ్రామంలో సుంకం చెల్లించని మద్యాన్ని అమ్ముతున్నారన్న సమాచారం మేరకు శుక్రవారం ఓ షాపుపై దాడి చేయగా 16 క్వార్టర్ బాటిళ్ల ఎన్డీపీఎల్ మద్యం దొరికినట్టు చెప్పారు. ఈ దాడులలో ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు, ఎస్సైలు ఎస్ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బైండోవర్ కేసు నమోదు

పోలవరం రూరల్: నాటు సారాయి కేసులో ముద్దాయిలను శుక్రవారం బైండోవర్ చేశారు. ఎక్సైజ్ సీఐ కె.వీరబ్రహ్మం మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఐదు నాటు సారా కేసుల్లో ముద్దాయిలను స్థానిక తహసీల్దార్ కోర్టులో హాజరు పరిచి, వారిని బైండోవర్ చేసినట్లు తెలిపారు.